క్లుప్తంగా

లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని నరసింహాపురం గ్రామంలోని పురాతన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రం స్వాతి, తొలిఏకాదశి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామున స్వామి, అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. ప్రత్యేకంగా పట్టు వస్త్రాలతో, వెండికవచాలు, రంగురంగుల పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవారిని దర్శించుకుని పూజించారు. భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

ఘనంగా సాయిబాబ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠలో టెంకాయలో కొలువైన రీతిలో సాయిబాబ విగ్రహం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వాసవి సర్కిల్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ మహాగణపతి, సద్గురు సాయిబాబా ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. గణపతి, నవగ్రహ, శాంతి హోమాలను నిర్వహించి మహాపూర్ణాహుతి సమర్పించారు. యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, కలశ సంప్రోక్షణ, వేద స్వస్తిలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. టెంకాయలో సాయిబాబ విగ్రహం కొలువైన రీతిలో ఎక్కడా లేని విధంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ సగబాల నాగరాజు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠానంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది.

దువ్వూరు ఎస్ఐగా శ్రీనివాసులు



దువ్వూరు : దువ్వూరు ఎస్ఐగా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పెద్దముడియం ఎస్ఐగా పని చేస్తూ దువ్వూరుకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి అనంతపురానికి బదిలీ అయ్యారు. ఎస్ఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజల సహకారంతో మండలంలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు కృషి చేస్తానన్నారు.

క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలి



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న సభ్యులు

బద్వేలు అర్బన్ : విద్యార్థులు దాతలు అందించిన సహకారాన్ని అందిపుచ్చుకుని క్రమశిక్షణతో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎం.వి జయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆరోగ్యభారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక షాలోమ్ అనాథ శరణాలయంలోని విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. అలాగే ప్రతి విద్యార్థి పరిశుభ్రత పాటించడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి కృషి చేయాలని కోరారు. అనంతరం పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య భారత్ ఫౌండేషన్ అధ్యక్షుడు టి.రహీమ్, సంస్థ సభ్యులు శ్రీనివాసులరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకటసుబ్బా రెడ్డి, విశ్వనాథరెడ్డి, రఫి, రెడ్డయ్య, శంకర్, అనాథ శరణాలయం నిర్వాహకురాలు దేవసుధ పాల్గొన్నారు.

ప్రవక్త మార్గం అనుసరణీయం

ప్రొద్దుటూరు కల్చరల్ : మహ్మద్ ప్రవక్త చూపిన మార్గం అనుసరణీయమని దర్గా మసీదు మౌల్వి మేరాజ్ రజా పేర్కొన్నారు. గురువారం కొర్రపాడు రోడ్డులోని ఈద్గా మైదానంలో బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లా చూపిన సన్మార్గంలో నడవాలని, చెడు వ్యసనాలను, చెడుగుణాలను వదిలివేయాలని తెలిపారు. భగవంతుడు చూపిన దయ, ప్రేమ మార్గంలో పయనించాలన్నారు. ఖుర్బాని గొప్పతనాన్ని వివరించారు. అంజుమన్ అహ్లె ఇస్లాం కమిటీ అధ్యక్షుడు బొల్లవరం బాషా, సెక్రటరీ ఇలియాస్ ఖురేషి, మౌల్వి ఇనాయతుల్లా, జామియా మసీదు కమిటీ మాజీ, తాత్కాలిక అధ్యక్షుడు ఎస్.అహ్మద్‌హుసేన్, మత పెద్దలు పాల్గొన్నారు. పట్టణంతోపాటు పరిసరాల గ్రామాలకు చెందిన ముస్లింలు ఈ ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు.

■ బక్రీద్ సందర్భంగా ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులకు కొర్రపాడు రోడ్డులో కొనిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి రస్నా పంపిణీ చేశారు. కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, రఘునాథరెడ్డి, బాషా, నాగేశ్వరరెడ్డి, మధుసూదనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజుపాళెం : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ముస్లింలు బక్రీద్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఉదయాన్నే మసీదులు వద్ద మత గురువులు అందించిన సందేశాన్ని విన్నారు. ఈ సందర్భంగా మత గురువులు మాట్లాడుతూ నిరు పేదలకు తోచినంత దానం చేయాలని తెలిపారు. అనంతరం ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకొని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

దువ్వూరులో..

దువ్వూరు : దువ్వూరు, గుడిపాడు, చింతకుంట, కానగూడూరు, కృష్ణంపల్లె, యర్రబల్లె తదితర గ్రామాల్లో ఉన్న ముస్లింలు గురువారం బక్రీద్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఈద్గాలో మత పెద్ద సాబ్జీ మాట్లాడుతూ బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరూ అల్లా చూపిన మార్గంలో నడవాలని తెలిపారు.





మాట్లాడుతున్న మౌల్విమేరాజ్ రజా, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

చాపాడులో..

చాపాడు : మండల వ్యాప్తంగా ముస్లింలు గురువారం ఉదయం బక్రీద్ ప్రార్థనలు చేశారు. మండలంలోని చాపాడు, ఖాదర్‌పల్లె, మడూరు, అన్నవరం, గుంతచీపాడు, తిమ్మాయపల్లె, రాజుపాళెం, వెదురూరు, ఓబుళరెడ్డిపేట, అల్లాడుపల్లె, పెద్దగురువళూరు పలు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగను జరుపుకున్నారు.

ఖాజీపేట : స్థానిక టీచర్స్‌కాలనీలో ఈద్గ వద్ద ముస్లింలు, నత్తడ్‌షా వలీ దర్గా నందు సర్వర్ ఖాన్‌పేటకు చెందిన ముస్లింలు ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. పండుగ గొప్పతనం గురించి వివరించారు.



బద్వేలులో ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం



కాశినాయన మండల కేంద్రం నరసాపురంలో..



చాపాడులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



రాజుపాళెంలో మసీదు వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పెద్దలంటే అంత చిన్న చూపా..

- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : యాభై ఏళ్ల పాటు రాజకీయ అనుభవం కలిగిన మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, రాయలసీమ ఉద్యమ నాయకుడు మాజీ ఎమ్మెల్యే ఎంవీ రమణారెడ్డి గురించి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఓ ఇంటర్వ్యూలో చులకనగా మాట్లాడటం తగదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మెల్యే మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతూ వరదరాజులరెడ్డికి పాతికేళ్లపాటు ఎమ్మెల్యేగా పనిచేసిన ఘనత ఉందన్నారు. వరద కేవలం గ్రామ నాయకుడని, ఎంవీఆర్‌ను బూచిగా చూపి ఐదు మార్లు ఎమ్మెల్యేగా గెలిచాడని ప్రవీణ్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎంవీ రమణారెడ్డికి రాయలసీమ సమస్యలపై అవగాహన లేదని, అజ్ఞాని అని విమర్శించారన్నారు. ఎంవీఆర్ రాయలసీమ కోసమే తన రాజకీయ పదవులను వదులుకున్నారని తెలిపారు. డాక్టర్‌గా, న్యాయవాదిగా, కార్మిక నాయకుడిగా, సాహితీ వేత్తగా ఆయనకు గొప్ప పేరు ఉందన్నారు. రాయలసీమకు సంబంధించి ఎంవీ రమణారెడ్డి, ఎంవీ మైసూరారెడ్డి గొప్ప నాయకుల జాబితాలో ఉన్నారన్నారు. శ్రీకృష్ణ దేవరాయలు కంటే గొప్పగా తన అబ్బ కోగటం గ్రామంలో పరిపాలన చేశాడని ప్రవీణ్ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తన స్వార్థం కోసం ప్రవీణ్ ఎంతటి వారినైనా చులకనగా మాట్లాడుతాడన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవ వేడుకలు

చాపాడు : మండలంలోని ఎస్.ఓబాయపల్లెలో గురువారం సీఎస్ఐ చర్చి 35వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరయ్యారు. చర్చిలో పాస్టర్లతో కలసి ఆయన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన కేశవరెడ్డి ఎడ్లు ప్రథమ స్థానంలో రూ.50వేలు, మైదుకూరుకు చెందిన కేవీఎస్ బుల్స్ వెంకటేష్ ఎడ్లు ద్వితీయ స్థానంలో రూ.40వేలు, గుంటూరు జిల్లా కొండపాటూరుకు చెందిన లక్షిత్ చౌదరి, తిప్పిరెడ్డిపల్లె విశ్వనాథ్ ఎడ్లు తృతీయ స్థానంలో రూ.30వేలు, పల్నాడు జిల్లా ఇనిమెట్ల వెంకటేశ్వర్లు ఎడ్లు నాలుగో స్థానం రూ.20వేలు, బాలయ్యగారిపల్లెకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఎడ్లు ఐదవ స్థానంలో రూ.10వేలు, ప్రకాశం జిల్లా బురుజుపల్లెకు చెందిన సోహిత్‌రెడ్డి ఎడ్లు ఆరవ స్థానంలో రూ.8వేలు, నంద్యాల జిల్లా పీఆర్‌పల్లెకు చెందిన గుండం చెన్నరెడ్డి ఎడ్లు ఏడవ స్థానంలో రూ.5వేలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ మూర్తులు రుక్మిణి పాండురంగస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ఆలయాల్లో గురువారం తొలిఏకాదశి పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక శ్రీరాముల పేటలోని రుక్మిణి పాండురంగ స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించి అలంకరించారు. సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. పాత మార్కెట్‌లోని రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామి, లలితాదేవికి విశేష అభిషేకాలు చేసి అలంకరించారు. సాయంత్రం సామూహికంగా విష్ణుసహస్రనామ పారాయణం, అన్నమాచార్య కీర్తనల ఆలాపనలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు.

రాజుపాళెం : మండలంలోని ఆలయాల్లో గురువారం తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి, నరసింహ స్వాముల ఆలయాల్లో ఆలయ చైర్మన్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, భక్తులు టెంకాయలు కొట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే కుందూనది ఒడ్డున ఉన్న సోమేశ్వర రామాలయంలో భక్తులు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కాశినాయన : మండలంలోని ప్రజలు తొలి ఏకాదశి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కత్తెరగండ్ల శివాలయం, జ్యోతి క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. గత ఐదు రోజులుగా జ్యోతిక్షేత్రంలో కాశినాయన ఆలయం వద్ద ఏకాంబర భజన చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వచ్చే ఆదివారం పౌర్ణమి రోజున కాశినాయన ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉపాధి పనుల కోసం పోరాటాలు ఉధృతం చేస్తాం



వ్యవసాయ కార్మిక సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బ్రహ్మంగారిమఠం : రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా రాష్ట్రంలో జరుగుతున్న పనులను ఇంకా పెంచేందుకు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం బ్రహ్మంగారి మఠంలో రాష్ట్రస్థాయి వ్యవసాయ కార్మిక సంఘం శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపాధి పనులు తగ్గాయని, కేంద్ర ప్రభుత్వం ఉపాధి పనులకు 20 శాతం బడ్జెట్‌లో నిధులను తగ్గించిందని తెలిపారు. పెరుగుతున్న గ్రామీణ పేదల జనాభాకు తగ్గట్టుగా కేంద్రం బడ్జెట్ పెంచాల్సింది పోయి తగ్గించిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం, ప్రధాన ప్రతిపక్షం, ప్రతిపక్షపార్టీలు స్పందించడం లేదన్నారు.రెండు రోజులపాటు జరిగే ఈ శిక్షణ తరగతుల్లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శివకుమార్, వి.అన్వేష్, అనంతపురం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుధాకర్, హిందూపురం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, కమిటీ సభ్యులు గోవింద్, వీరయ్య పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని దేవస్థానం ఆవరణలో గురువారం భక్తులు భజనలు చేశారు. తోట్లపల్లె అచలానంద ఆశ్రమంలో ప్రత్యేక కార్యక్రమాలు, కోలాటాలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీరబ్రహ్మేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

ఖాజీపేట : మండలంలో ఏకాదశి పండుగను వైభవంగా నిర్వహించారు. ఖాజీపేటలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అగ్రహారంలోని శివాలయంలో కన్నుల పండుగగా జరుపుకున్నారు.

చేనేతల కోసం సీఎం కృషి అభినందనీయం

ఖాజీపేట : చేనేతల కష్టాలను సీఎం జగన్ చూశారు అందుకే వారి సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అప్పనపల్లె పంచాయతీ పరిధిలో అప్పనపల్లె, బోసిరెడ్డిపల్లె, దళితవాడ, వెంకటరామాపురం గ్రామాల్లోని ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి సంక్షేమ ఫలాలు అందుతున్న లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అక్రమాలు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఒక్క అప్పనపల్లె పంచాయతీలోనే నేతన్న నేస్తం పేరుతో రూ.5 కోట్లు అందుతోందన్నారు. అందుకే వారందరూ ప్రభుత్వంపై అభిమానం చూపుతున్నారన్నారు. అనంతరం గ్రామంలో విద్యుత్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. అధికారులతో వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. బోసిరెడ్డిపల్లెలో స్మశాన వాటికకు దారి కల్పించాలని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తేవడంతో ఆయన హామీ ఇచ్చారు. దళితవాడలో డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్నట్లు తెలపడంతో ఏర్పాటుకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం చౌడేశ్వరి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, అప్పనపల్లె సర్పంచ్ లక్ష్మమయ్య, ఎంపీపీ అబుబకర్ సిద్ధిక్, ఎంపీటీసీ బండి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టుపోగుల పుల్లాయ్య, శ్రీను, పూజలరమణయ్య, పుల్లగూరు సుబ్బరాయుడు, మైదుకూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ శ్రీమన్‌నారాయణరెడ్డి, జితేంద్ర, సర్పంచ్ పెద్దిరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ కనపర్తి సుబ్బారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీది నిర్లక్ష్యం.. మాది అభివృద్ధి

- ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి
- రూ.2.64 కోట్ల తారు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



తారు రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలో టీడీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిపై నిర్లక్ష్యం వహించగా.. తమ హయాంలో మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడుపుతున్నామని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. గురువారం మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని భూమాయపల్లె, తిమ్మాయపల్లె, గొల్లపల్లె, బండివారిపల్లె గ్రామాలను కలుపుతూ రూ.2.64 కోట్లతో చేపట్టిన తారు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేసి మాట్లాడారు. టీడీపీ ఐదేళ్లలో మున్సిపాలిటీలో ఎక్కడే గాని అభివృద్ధి అన్నది మచ్చుకైనా కనిపించలేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహంతో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. మున్సిపాలిటీలో 15 చోట్ల 21.5 కిలోమీటర్ల మేరకు రూ.19.10 కోట్లతో తారు రోడ్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో రూ.1.23 కోట్లతో గొల్లపల్లె నుంచి తిమ్మాయపల్లె వరకు, రూ.70 లక్షలతో భూమాయపల్లె నుంచి కృష్ణాపురం మీదుగా కొండయ్యస్వామి ఆశ్రమం వరకు, రూ.71 లక్షలతో తిమ్మాయపల్లె నుంచి బండివారిపల్లె వరకు తారు రోడ్లను నిర్మించేందుకు భూమి పూజ చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీలో రూ.15.70 కోట్లతో మేజర్ డ్రైన్స్, రూ.6.68 కోట్లతో సీసీ రోడ్లు, రూ.2 కోట్లతో పార్కు, రూ.2.30 కోట్లతో ఎర్ర చెరువు సుందరీకరణ, రూ.50 లక్షలతో వీధి లైట్లు మూడో వైర్ ఏర్పాటు, రూ.1.23 కోట్లతో కేసీ కాలువ క్రాసింగ్ వంతెనల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. ఇవికాక మైదుకూరులో రూ.33 కోట్లతో వంద పడకల ఆస్పత్రి, రూ.10 కోట్లతో డిగ్రీ కాలేజికి సొంత భవనాల నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో ఆరు బ్రాంచిలతో పాలిటెక్నిక్ కాలేజిని ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీకి టీడీపీ హయాంలో రూ.5 కోట్లు ప్రకటించిన చంద్రబాబు కేవలం రూ.2 కోట్లు మాత్రమే ఇచ్చారని విమర్శించారు. అభివృద్ధి పేరుతో దొంగ బిల్లులు చేసుకొని కోట్లాది రూపాయలు ప్రజా ధనాన్ని దోచుకొని కమిషనర్లు, కాంట్రాక్టర్లను జైలుకు పంపిన ఘనత టీడీపీదని ఎమ్మెల్యే ఆరోపించారు. ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో వారికే ఓటు వేయాలని ప్రజలను కోరుదాం.. ఇదే నా ఛాలెంజ్ అని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వార్డు నాయకులు బీఎల్ రఘురామయ్య, ఏసీకే చెంద్రాయుడు, భూమిరెడ్డి నరసింహులు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కేపీ లింగన్న, మండల కన్వీనర్ గల్లా నరసింహారెడ్డి, ఎంపీపీ థామస్, సీనియర్ నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి, కుశెట్టి రాయుడు, భూమిరెడ్డి సుబ్బరాయుడు, దువ్వూరు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుడిపాడు బాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ షరీఫ్, కౌన్సిలర్ వెంకట సుబ్బన్న, కోఆప్షన్ సభ్యుడు ట్రాక్టర్ గౌస్, మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి, ప్రజారోగ్యశాఖ ఈఈ చిన్న కేశవరెడ్డి, ఇన్‌చార్జి డీఈఈ యశోధర పాల్గొన్నారు.

జానపద కళలను మరువద్దు

బ్రహ్మంగారిమఠం : గ్రామీణులు జానపద కళలను మరువకూడదని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హనుమంతు వెంకటసుబ్బయ్య తెలిపారు. గురువారం సాయంత్రం మండలంలోని తోట్లపల్లె అచలానంద ఆశ్రమంలో లలిత కళాభిరామ పీఠం, నటరాజ కులుకు భజన వారి ఆధ్వర్యంలో జానపద కళాప్రోత్సాహక ఉత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జానపద కళల కోసం ప్రభుత్వాలు తమ వంతు కృషి చేస్తున్నాయని, ప్రస్తుత సమాజంలో టీవీలు, సోషల్ మీడియా రావడంతో కళలు వెనుకబడ్డాయన్నారు. ప్రధానంగా జానపద కళలను గ్రామీణ ప్రాంతాల ప్రజలు కొంత వరకు ఆదరిస్తున్నారని తెలిపారు.

ఆశ్రమ పీఠాధిపతులు విరజానంద స్వామి మాట్లాడుతూ జానపద కళలను ప్రభుత్వాలు ప్రోత్సహిస్తే, ఆ కళలను నేర్పించే వారు ముందుకు వస్తారన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ కళాకారులకు మెమెంటోలను అందించి సత్కరించారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బీబీ చాన్ గృహప్రవేశం



రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు ఆధ్వర్యంలో గురువారం ఓ నిరుపేద వృద్ధురాలు తన సొంతింటి కల సాకారం చేసుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒంటరిగా నివసిస్తున్న వృద్ధురాలికి ఇల్లు నిర్మించి ఇస్తానని తాను గతంలో ప్రకటించానన్నారు. ఈ మేరకు తమ పార్టీ నాయకుడు వడ్ల దాదాపీర్, కౌన్సిలర్ వడ్ల ఖలీల్ ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ నాయకులు సాయం చేసి ఆమెకు ఇల్లు నిర్మించేలా చేశారన్నారు. ఖురాన్ పఠించే ఆమెకు ఇల్లు నిర్మించి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో 22వ వార్డు ఇన్‌చార్జి హిదాయత్, 25వ వార్డు ఇన్‌చార్జి నూరి, ఖాదర్ హుసేన్ మసీదు కమిటీ అధ్యక్షుడు గౌస్‌మొద్దీన్, ముతవల్లి అజ్మతుల్లా, కమిటీ సభ్యులు నౌషాద్, హర్షద్, సమీవుల్లా, సయ్యద్ జమాల్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశేషారెడ్డి పాల్గొన్నారు.